www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 29 డిసెంబరు 2025

5

చిత్తూరు

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్)ను సోమవారం నిర్వహించ నున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరం లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్జీ దారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లోనూ వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చు నని తెలిపారు. వారి అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి, వాటి స్థితికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలనుకుంటే1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

కొండెక్కిన 'కోడి' ధరలు

- రోజు రోజుకు పెరుగుతున్న కోడి గుడ్లు,
- పోటీ పడుతున్న కూరగాయల ధరలు
- దిక్కుతోచని స్థితిలో సామాన్యులు

ప్రజాశక్తి-పలమనేరు: నిత్యావసరాల ధరలు భగ్గుమం టున్నాయి. వంటింట్లో కుంపటి పెట్టాలంటేనే అయోమ యంలో పడే పరిస్థితి నెలకొంది. ఉప్పు, పప్పులతో పాటు కూరగాయల ధరలు పోటీపడి ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇదే బాటలో మాంసం, చికెన్, గుడ్ల ధరలు కూడా ఆకాశానికి ఎగబాకుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఏమి కొనాలో.. ఏమి తినాలో తెలియక సామాన్య నిరుపేదలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు..

కొండెక్కిన కోడి మాంసం ధరలు

ప్రస్తుతం మార్కెట్లో కిలో చికెన్ 280 నుంచి రూ.300 వరకు పలుకుతోంది. కిలో మాంసం రూ.800 నుండి 850 ల వరకు ఉంటోంది.. ఇక గుడ్డు ధర ఏకంగా రూ.8 నుండి రూ.8.30కు చేరింది. కేవలం వారంలోనే కిలో చికెన్‌పై 50 రూపాయలు పెరిగింది. కార్తీకమాసం ముగిసి నప్పటి నుండి చికెన్ ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ఇలా క్రమంగా వారం వారం కిలో చికెన్‌పై రూ.10 నుంచి 20 రూపాయల వరకు పెరుగుదల కనిపిస్తోంది. ప్రస్తుతం కేజీ స్కిన్ చికెన్ 260 కాగా.. స్కిన్ లెస్ చికెన్ కేజీ రూ.280 నుండి 300 పలుకుతోంది.

రోజు రోజుకు పెరుగుతున్న కోడి గుడ్ల ధరలు

ఆదివారం కావడంతో మండలంలోని మాంసం ప్రియులు అధిక ధరలు చెల్లించి చికెన్ ముక్క కొనలేక గుటకలు వేశారు. వచ్చే నెలలో సంక్రాంతి ఉండటంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. మరోవైపు గుడ్ల ధరలు కూడా పెరగడంతో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు సైతం అందించలేక తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ. 6 మాత్రమే చెల్లిస్తోంది. కానీ మార్కెట్‌లో హోల్‌సేల్ ధర రూ.7.50 వుంది. రిటైల్ ధర రూ.10 పలుకుతోంది. ఈ క్రమంలో విద్యార్థులకు వారానికి మూడు సార్లు అందించాల్సిన గుడ్లను రెండు సార్లు మాత్రమే అందిస్తున్నారు.

ధరల పెరుగుదలకు కారణం?

గత కొద్దిరోజులుగా కోడిగుడ్లు, చికెన్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కార్తీక మాసం ముగియడం, వరుస పండుగలు రావడంతో

చికెన్‌కి ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్లుగా పౌల్ట్రీ ఉత్పత్తి లేకపోవడంతో సరఫరా దెబ్బతిని ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. మొత్తం వచ్చే పండగ నెలలోనూ చికెన్ రేట్లు కిలో రూ.350 నుంచి రూ.400 వరకు మాంసం ధర కిలో రూ.800 నుండీ 850 ల వరకు పలికే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రయాణించేదెలా?

- చిన్నకాజ్‌వేతో భద్రత కరువు
- పాచిపట్టిన రోడ్డు
- ఆందోళనలో జొన్నగురుకుల- అరగొండ రహదారి ప్రజలు

ప్రజాశక్తి-తవణంపల్లె: చిన్న కాజ్‌వేతో ఆ గ్రామ ప్రజలు ప్రయాణించాలంటే ఇబ్బందులకు గురవు తున్నారు. రోడ్డు పాచిపట్టిపోవడంతో వర్షం పడితే జారిపడి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం వుందని భయాందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, స్కూలు బస్సులతో పాటూ పాదచారులు అధిక సంఖ్యలో వెళుతుంటారు. ఇరుకు మార్గం కారణంగా పలు ఇబ్బంది లకు గురవుతున్నారు. ఈ దుస్థితి నెలకొన్న తమకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని జొన్నగురుకుల -అరగొండ మార్గం ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణించేదెలా?

బంగారుపాళ్యం(వయా) జొన్నగురుకుల -అరగొండ మార్గంలో ప్రయాణించే ప్రజలకు అత్యంత కీలకం..ఇది కేవలం రోడ్డు సమస్య కాదు..ప్రజల ప్రాణ భద్రతపై ఆధారపడి వుంది. గొడ్డు వంక -బాహుదా నది కాజ్‌వే వద్ద వర్షాకాలం ప్రారంభం కాగానే పరిస్థితి భయాందోళన కరంగా మారుతోంది. వాగులో నీరు నిలిచి పోవడంతో రోడ్డుపై పచ్చటి పాచి పేరుకు పోయి, ప్రయాణం తీవ్ర ప్రమాదకరంగా మారు తోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, స్కూల్ బస్సులు, పాదచారులు, పశువుల రాకపోకలు ఈ ప్రాంతంలో అధికంగా ఉండటంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది.

పాచిపట్టిన రోడ్డు

ఈ కాజ్‌వేపై పాచిపట్టి ప్రమాకరంగా మారడంతో స్థానికులు తమవంతు సహకారంతో జెసిబిలు, ట్రాక్టర్ల సాయంతో పాచిని తొలగిస్తున్నా మూడు నాలుగు రోజుల్లోనే మళ్లీ అదే పరిస్థితి నెల కొంటోంది. దీంతో ఈ చర్యలు తాత్కాలిక ఉపశమనంగా మాత్రమే మిగులుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో జొన్నగురుకుల గ్రామ

పాచిపట్టి ప్రమాదకరంగా మారిన కాజ్‌వే

పంచాయతీ సర్పంచ్ సరిత రాజశేఖర్ రెడ్డి తన సొంత నిధులతో కల్వర్ట్ వద్ద చిన్న వారధిని ఏర్పాటు చేసి ప్రయాణికులకు తాత్కాలిక భద్రతను కల్పించారు. 'వారధి చిన్నదే అయినా అనేక ప్రమాదాలను నివారిస్తోంది' అంటూ వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిన్ని కృష్ణ, తులసి రామ్ రెడ్డి, నాగేంద్ర పిళ్లై, డి మధు, జొన్నగురుకుల యువకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సర్పంచ్‌కు సహకారం అందించారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

గ్రామస్తులు, నిత్యం ఈ మార్గాన్ని ఉపయోగించే ప్రయాణికులు ఈ వారధి శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేస్తున్నారు. గొడ్డు వంక కల్వర్ట్ వద్ద పాచి పూర్తిగా తొలగింపు, కాంక్రీట్ పనులు, సరైన డ్రైనేజ్, అవసరమైతే శాశ్వత వారధి లేదా రోడ్ సేఫ్టీ చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుందో అని స్థానిక ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

ప్రజల వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఎస్‌పి సాయినాథ్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి -యాదమరి: యువత మత్తు పదార్థాలకు, గంజాయికి దూరంగా ఉండాలని డీఎస్పీ సాయినాథ్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బుడితిరెడ్డిపల్లి గ్రామంలో సీఐ శ్రీధర్ నాయుడు స్థానిక పోలీసులతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులతో పాటు వారి ఇళ్లను తనిఖీలు చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై మత్తు పదార్థాల వాడకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాయినాథ్ మాట్లాడుతూ...యువత మత్తు పదార్థాలు గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి బానిసలై తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారన్నారు. తద్వారా తమ ఆరోగ్యం క్షీణించడమే కాకుండా తల్లిదండ్రులను సైతం మానసిక క్షోభకుగురి చేస్తున్నారన్నారు. గ్రామంలో ఎవరైనా గంజాయి, తదితర మత్తు పదార్థాలు వాడితే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు వాడినా, సరఫరా చేసినా అలాంటి వారి వివరాలు తప్పకుండా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మత్తు రహిత సమాజానికి ప్రతీ ఒక్కరూ కృషి చెయ్యాలని ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులకు పిలుపు నిచ్చారు. అనంతరం ఆయన గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

కరాటే పోటీల్లో నగరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : తమిళనాడు, తిరువళ్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో నగరి విద్యార్థులు ప్రతిభ ప్రదర్శిం చారు. నగరి పట్టణ పరిధి నుంచి కరాటే మాస్టర్ రాజ్‌కోటి ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరుకాగా వీరిలో ఐదు గురు ప్రథమ స్థానాన్ని, ఇద్దరు ద్వితీయ స్థానాన్ని, ముగ్గురు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

క్రీడాకారులను ప్రోత్సహిద్దాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పలమనేరు: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు బాయ్స్ ఆఫ్ బాలు క్రికెట్ అకా డమీ నిర్వహకులు, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఆదివారం ఎమ్మెల్యే ను కలిసి సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలంగా డిగ్రీ కళాశాల ఆవరణలోని మైదానంలో క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే ఇటీవల ఆ ప్రాంతంలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థు లకు వసతి గృహాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ నిర్ణయాన్ని చాలామంది వ్యతిరేకించారు. ఇప్పటికే డిగ్రీ కళాశాల మైదానం చాలా చిన్నదిగా మారిపోయిందని ఇక వసతి గృహాలు ఏర్పాటు చేస్తే క్రీడాకారులకు స్థలమే లేకుండా పోతుందని గతంలో ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవచూపి వసతి గృహాలకు ఇతర ప్రాంతంలో స్థలాలను కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఎమ్మెల్యేను అభినందిస్తూ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు కొన్ని వసతులు కల్పించాలని అకడమీ నిర్వాహకులు బాలాజీ కోరారు. దీనిపై వెంటనే స్పందిస్తూ బీసీసీఐ ను

పర్యవేక్షించే ఎంపీ కేశినేని చిన్నితో ఫోన్లో సంప్రదించి తమ ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. అనంతరం ఆయన వారితో మాట్లాడుతూ క్రీడా కారులను ప్రోత్సహించేందుకు తను సహకరిస్తా నన్నారు. ఈ ప్రాంతం నుంచి మంచి క్రీడాకారులను గుర్తించి వారిలోని ప్రతిభను వెలికి తీయాలన్నారు. మంచి క్రీడా కారులను ప్రోత్సహించి వారిని అభివృద్ధిలోకి తీసుకొద్దామని ఆయన కోరారు.

నగరిని తిరుపతి జిల్లాలో కలపాలి

- లేకుంటే ఆందోళన ఉధృతం
- అఖిలపక్ష పోరాట సమితి నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : జిల్లాల పునర్విభజనలో మండలాలను ఇతర జిల్లాలలో కలుపుతున్నట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తున్నా నగరి, నింద్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపకపోవడంపై మూడు మండలాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ మండలాలను తిరుపతి జిల్లాలో కలపకుంటే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామంటూ అఖిలపక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో రోడ్డెక్కారు. ఆదివారం బస్టాండ్ ప్రాంగణంలో నిరసన ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆర్ బాబు మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానాన్ని సీఎం నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఇదే స్థానంలో ఇచ్చిన హామీని అందరూ నమ్మి ఓట్లేస్తామన్నారు. అయితే ప్రస్తుత విభజనల్లో నగరి ఊసే లేకపోవడం బాధాకర మన్నారు. గూడూరులో తీసుకున్న నిర్ణయం ఎందుకు నగరిలో తీసుకో కూడ దన్నారు. గేట్‌వే ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రెండు జిల్లా లుగా ఉండటాన్ని మా ర్చా ల్సిన పరిస్థితి ఎంతైనా ఉంద న్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మా ట్లా డుతూ ఎన్నికల సమ యంలో మూడు మండలా లను తిరుపతి జిల్లాలో కలుపుతామని హామీ ఇస్తే ప్రజలు ఓట్లేస్తారన్నారు. ఎన్నికల అనంతరం ఈ అంశం చర్చకు వస్తే ఎంతో సంతోషిం

మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

చామన్నారు. అయితే నేడు ఆవేదనకు గురవుతు న్నారన్నారు. నగరి ఎంవిఐ కార్యాలయంలో ఉన్న ఎఫ్‌సీ చేసుకునే సదుపాయాన్ని బంగారు పాళెంలో మార్చి వాహనదారులను ఇబ్బంది పెట్టడం తప్ప ఏమీ జరగలేదన్నారు. ఇతర జిల్లాలో సాధ్యమైన పని ఇక్కడ ఎందుకు సాధ్యం కాలేదన్నారు. త్రికరణ శుద్ధితో ఇచ్చిన హామీని నెరవేర్చాలని లేకుంటే రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమం లో అఖిల పక్ష నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో నేడు పిజిఆర్ఎస్

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నామని కుప్పం నియోజకవర్గ ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తెలపాలన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వినాయకుని చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

వరసిద్ధుని సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి -ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమలేఖ కుటుంబ సమే తంగా ఆదివారం దర్శించు కున్నారు. వారికి దేవస్థానం ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, చిత్తూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా జల్లికట్టు

- పరుగులు పెట్టిన కోడెగిత్తలు
- చిన్నపోటు చేను జనసంద్రం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఎద్దుల పరుగు పందేల (జల్లికట్టు) కోసం చిన్నపోటు గ్రామం వేదిక అయింది. వాటిని నిలువరించి వాటి కొమ్ములకు కట్టిన పట్టీలను (బహుమతులు) చేజిక్కించుకునేందుకు యువకులు పోటీపడ్డారు. మండలంలోని పచ్చికాపలం పంచా యతీ , చిన్నపోటు చేను గ్రామంలో ఆదివారం జల్లికట్టు ఉత్సవాన్ని ఆ గ్రామస్తులు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎద్దులు భారీ సంఖ్యలో ఆ గ్రామానికి చేరుకున్నాయి. గ్రామంలోని యువకులు ఎద్దులకు దొడ్డిలను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు ఏర్పాటు చేసిన అల్లి నుంచి ఎద్దులను నిలువరించి వాటి కొమ్ములకు పట్టీలు కట్టి వదిలారు. యువకులు ఆ పట్టీలను చేజిక్కించుకునేందుకు పోటీ పడ్డారు. జల్లికట్టును తిలకరించడానికి పక్క మండలాలైన రామచంద్రపురం, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, తమిళనాడు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో జనం ఈ గ్రామానికి చేరుకుని అల్లిలో నిలబడ్డారు. కొంతమంది యువకులు ఎద్దులను నిలువరించి ఎద్దుల కొమ్ములకు కట్టిన పట్టీలను చేజిక్కించుకుని కేరింతలు కొట్టారు. కొన్ని ఎద్దులు యువకులు చేతికి చిక్కకుండా పట్టీలతో పరుగులు తీసి సొంత గ్రామానికి చేరుకున్నాయి. గ్రామస్తులు వచ్చిన వారికి నీళ్లు, అన్నదానం ఏర్పాటు చేశారు.

కోడె గిత్తలను నిలువరిస్తున్న యువకులు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టరు సుధారాణి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు పని చేస్తున్నాయని, ఈ మేరకు రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని వైద్యశాఖలో పని చేస్తున్న డాక్టర్లు, నర్సులు ఇతర సిబ్బందికి ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారని, సీజన్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని, పోలియో చుక్కలు వేయించడం, దోమల నివారణ కోసం ఫైడే డ్రైడే, హెచ్ఐవి నియంత్రణ దోమల నివారణ కోసం ప్రజలు తీసుకోవాలసిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయి సిబ్బంది వారి వారి ప్రాంతాల్లో ప్రజలకు అవగాన కల్పిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ సుధారాణి తెలిపారు. 'ప్రజాశక్తి' అడిగిన పలు ప్రశ్నలకు వారు సమాధానం ఇచ్చారు.

ప్రజాశక్తి: జిల్లాలో ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రాలెన్ని?

డిఎంఅండ్‌హెచ్‌వో: చిత్తూరు జిల్లా విషయానికొస్తే జిల్లా ఆసుపత్రి ఒకటి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 50, 24-7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 20 నాన్ 24-7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 30, సబ్ సెంటర్లు 613, సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సిహెచ్‌సి) 7, ప్రాంతీయ వైద్యశాలలు 3, వైద్య కళాశాలలు 3, నవజాత శిశు సంరక్షణ కేంద్రం 1, పట్టణ ఆరోగ్య కేంద్రాలు 14, రక్తనిధి కేంద్రాలు 2 ఉన్నాయి.

ప్రజాశక్తి: ఇప్పటి వరకు వ్యాధినిరోధక టీకాలు ఎంత మందికి వేశారు?

డిఎంఅండ్‌హెచ్‌వో: జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి వ్యాధి నిరోధక టీకాలు వేశాము. 39,27,700 మందికి వ్యాధి నిరోధక టీకాలు అందించాము.

ప్రజాశక్తి: సురక్షిత ప్రసవాల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎంఅండ్‌హెచ్‌వో: సురక్షిత ప్రసవాల విషయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా ఆదేశాలు జారీ చేశారు. మాత శిశు మరణాలపై సమీక్షలు నిర్వహిస్తూ కారణాలు తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులో 8,763, ప్రవేటు ఆసుపత్రుల్లో 7,521 ప్రసవాలు జరిగాయి. 4,290 హైరిస్క్ కేసులను గుర్తించి ప్రత్యేక చికిత్స అందించాము.

పజాశక్తి: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు ఎలా అందుతున్నాయి?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: ప్రభుత్వ ప్రభుత్వ ఆసుప్రతుల్లో కాన్పు కోసం వచ్చే వారిని సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 16 వాహనాలు సేవలు

అందిస్తున్నాయి. 3,930 మంది ప్రయోజనం పొందారు.

ప్రజాశక్తి: చంద్రన్న సంచార వాహనాలు, 108 వాహనాలు ఎన్ని ఉన్నాయి?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: చంద్రన్న సంచార వాహనాలు 44, 108 వాహనాలు 33 సేవలందిస్తున్నాయి. చంద్రన్న సంచార వాహనాల ద్వారా 50,34,06 మంది లబ్ధిపొందుతున్నారు. ఇందులో 36, 340 మంది గర్భిణులు, 114,316 మంది మధుమేహం వ్యాధిగ్రస్తులు, 15,49,75 రక్తపోటు వ్యాధి గ్రస్తులు చికిత్స పొందున్నారు. 108 వాహనాల ద్వారా 21,870 మందికి చికిత్సలు పొందారు. 3,046 మంది గర్భిణులను సకాలంలో ఆసుపత్రులకు తరలించారు. ఇక చిత్తూరు జిల్లాలో మలేరియా వల్ల ఒకరు మృతి చెందగా, డెంగీ మరణాలు 68 ఉన్నాయి. చికెన్ గున్యా 1 ఈ సంఖ్య ఈ ఏడాది జనవరి నుండీ అక్టోబర్ మాసం వరకు చోటు చేసుకున్నాయి.

ప్రజాశక్తి: జిల్లా ప్రజలకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: వైద్య ఆరోగ్యశాఖ సూచనల మేరకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, సీజనల్ వ్యాధులపట్ల అప్ర మత్తంగా ఉండాలి. దోమల నివారణ కోసం తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలి.

ముందస్తు వైద్య పరీక్షలతో గుండె జబ్బుల నివారణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా ప్రమాదకర గుండె జబ్బులు నుంచి రక్షణ పొందవచ్చని జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు చెప్పారు. బెంగళూరు, వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరు రూరల్ మండలం బంద్లమొట్టపాలెం గ్రామంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చి ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైదేహి ఆసుపత్రి చెందిన గుండె వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండెకు సంబంధించి ఈసీజీ, రక్త పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందు లను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 240మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు వైదేహి ఆసుపత్రి కో ఆర్డినేటర్ డా. లోకేష్ భరణి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడు రఘు, టిడిపి అధ్యక్షుడు ఉదయ్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-శాంతిపురం: ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని శాంతిపురం మండల కేంద్రంలో కుప్పం కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ ఆవుల గోపి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామీణ బ్యాంకు సర్కిల్‌లో ఆ పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలు, ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర సంగ్రామంలో తెల్ల దొరలను ఎదిరించి భారతదేశానికి స్వాతంత్రం సాధించడానికి ఆవిర్భవించిన పార్టీ తదనంతర కాలంలో రాజకీయ పార్టీగా అవతరించిందన్నారు. దేశ అభివృద్ధికి పాటు పడుతూ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాంతిపురం, కుప్పం, గుడిపల్లి, రామకుప్పం మండలాల పార్టీ అధ్యక్షులు నంజప్ప, మునస్వామి, కృష్ణప్ప గౌడ, సుబ్రహ్మణ్యం, మునిసిపల్ అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయకులు ఇర్ఫాన్, సుందర్ మూర్తి, వేలు, శ్రీనివాసులు, ముని రామయ్య, నాగరాజు, ముని కుట్టి, రోహినప్ప, సుబ్రహ్మణ్యం, ప్రభాకర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు: సిఐ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మత్తు పదార్థాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని బంగారుపాళ్యం దళితవాడలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయాలపై అనుమానాలు ఉన్నాయని పాత నేరస్తులను విచారించి గ్రామాల్లో గంజాయి మత్తు పదార్థాలను విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ఐఎఫ్ఎస్ అధికారి

ప్రజాశక్తి-ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయకుడిని రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం చైర్మన్ మణి నాయుడు దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

రతన్ టాటా సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: పారిశ్రామిక వేత్త రతన్‌టాటా సేవలు మరువలేనివని మండలంలోని పచ్చికాపల్లంకు చెందిన శ్రీ లక్ష్మీ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ వ్యవస్థాపకులు ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పచ్చికాపల్లంలో దేవళం పేటకు వెళ్లే దారిలో ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న శ్రీ లక్ష్మీ మొబైల్స్ షాప్ ఎదుట రతన్ టాటా చిత్రపటాన్ని ఉంచి ఆయనకు నివాళులు అర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయనను మార్గదర్శకంగా తీసుకుని సమాజంలో యువకులు ఆ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల నిధులు ఆలయానికి వినియోగం

ఆలయ మాజీ చైర్మన్ చెన్నరాజు శెట్టి

ప్రజాశక్తి-చౌడేపల్లి: శ్రీ అభీష్టత మృత్యుంజయశ్వర స్వామి ఆలయానికి దాతలు ఇచ్చిన విధులను స్వామివారి కైంకర్యాలకు వినియోగిస్తున్నట్లు ఆలయ మాజీ చైర్మన్ చెన్నరాజు శెట్టి తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకటనారాయణ బట్ ఆధ్వర్యంలో ఆయన ప్రసంగిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకటనారాయణ భట్ ఆయన సోదరుడు సరస సుబ్రహ్మణ్యంలు రూ 3 లక్షలు పుంగనూరు జమీందారీ వంశీయులు ఆమినిగుంటకు చెందిన సుగుటూరు రాజేంద్ర, సుగుటూరు బసవరాజా , సుగుటూరు రాజా రమేష్ రాయలు కలసి రూ 3.20 లక్షలు విరాళంగా అందించాలని బ్యాంకులో డిపాజిట్ చేయగా ప్రస్తుతం రూ 9 లక్షలకు చేరుకుందన్నారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో అలాగే ఉంచి ప్రతి సంవత్సరం దాని ద్వారా వచ్చే వడ్డీతో మృత్యుంజయేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆలయంలో జరిగే కార్యక్రమాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి కుటుంబ సభ్యులు తానాదార్, నాగరాజు గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ రావు, అందె రాజన్న , సింగిల్ విండో చైర్మన్ హరి ప్రసాద్ రాయల్, మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి . ప్రకాష్, యువనేత శ్రీరామ్ అరుణ్, కుమారులు పాల్గొన్నారు.

'ప్రజా దర్బార్'లో చల్లా బాబు రెడ్డి

ప్రజాశక్తి - రొంపిచర్ల: టిడిపి పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి స్వగృహంలో ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు , ప్రజలు తమ సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. స్పందించిన ఆయన సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 24 గంటలు అందుబాటులో ఉన్న నాయకుడు మనకు దొరకడం మన అదృష్టం అని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరం

-209 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -కార్వేటినగరం : తిరుపతి గీతా గోవిందం సేవా సమితి ఆధ్వర్యంలో డియంపురంలో భజన మందిరం పక్కన మైదానంలో సర్పంచ్ తులసి కృష్ణ యాదవ్ సమక్షంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ బాల గుర్రప్ప మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైద్య అధికారులు డాక్టర్ కెవిఎన్ సృజన, డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ రమ్య, డాక్టర్ రాజారాం, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ గీత, సౌజన్య, డాక్టర్ సి సందీప్, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ కెవి చంద్రిక, కీళ్ల నొప్పులు, శ్వాస, చర్మ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, మహిళలకు అన్ని రకాల జబ్బులకు ఉత్తమ మందులు, మాత్రలు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి ద్వారకానగరం, కారువాటికండ్రిగ, గొల్ల కండ్రిగ, మిట్ట కండ్రిగ, బియ్యం పురం, మూలకండ్రిగకు చెందిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వెంకటరమణ, ఫౌండేషన్ ప్రెసిడెంట్ దామోదరం, కార్యదర్శి గుణశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మునేంద్ర, డాక్టర్ మధుసూదన్, పద్మావతి, మాజీ సర్పంచ్ వెంకట మని, భీమారావు, నరేంద్ర, శ్యామ్ బాబు, అధిక సంఖ్యలో రోగులు, పలువురు పాల్గొన్నారు.

మృత్యుంజయశ్వర స్వామి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి బట్టి

ప్రజాశక్తి -చౌడేపల్లి: స్థానిక మృత్యుంజయశ్వర స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకటనారాయణ బట్టి దర్శించుకున్నారు. తొలుత చెడుగుట్లపల్లి మార్గంలోని నాగుల రాళ్లకు అభిషేకం చేసిన అనంతరం మృత్యుంజయశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షిత్ లు కుమారస్వామి మహేష్ లు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వాదం చేశారు. ఈ కార్యక్రమంలో జనరాజశెట్టి, తానాదర్ నాగరాజా స్థానికులు పాల్గొన్నారు.

యాదమరి విద్యాశాఖ అధికారికి ఘన సన్మానం

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి మండలం విద్యాశాఖ అధికారి రుక్మిణికి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం చేశారు. ఆదివారం చిత్తూరు ఆర్ఆర్ గార్డెన్స్‌లో యాదమరి మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రుక్మిణి ఈనెల 31వ తేదీ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి పూర్వ చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, డిప్యూటీ డిఈఓ ఇందిర పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ 42 సంవత్సరాలుగా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి, సుదీర్ఘకాలం ప్రభుత్వ సేవలు అంకితభావంతో క్రమశిక్షణకు మారుపేరు రుక్మిణి అని కొనియాడారు. ఈ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి యాదమరి మండల పరిధిలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయు లు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలవేసి దుశ్శాలు వతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్, పూర్వ డిఈఓ వరలక్ష్మి , డివైఈఓ ఇందిర, యాదమరి ఎంఈఓ 2 ప్రసాద్ , యాదమరి టిడిపి మండల అధ్యక్షులు మొరార్జీ , టిడిపి ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ టిడిపి తెలుగు యువత నాయకులు అమర నాథ్, రాజకీయ ప్రముఖులు, ఇతర అధికారులు , వివిధ సంఘ నాయకులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రెడ్డప్ప నాయుడు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పంటపల్లి సురేష్, రెహనా, పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకాచారి, ఎస్‌టియు అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మణికంఠం , రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, యాదమరి యుటిఎఫ్ మండల అధ్యక్షులు సర్దార్ , రెహనా, మండల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదమరి ఎంఈవో రుక్మిణిని సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు, తదితరులు

ఎమ్మెల్యేను కలిసిన టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు మంజులమ్మ

ప్రజాశక్తి-పలమనేరు: చిత్తూరు జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు పి మంజులమ్మ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీకి తాను అందించిన సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షురాలు పదవిని కట్టబెట్టినందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఆమె ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా పదవి కట్టబెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, స్థానిక ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. పార్టీ పతిష్టతకు తన వంతు కృషి చేస్తానని అందరిని సమన్వయం చేసుకొని ముందుకు వెళతానన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మండల నాయకులు నాగరాజు రెడ్డి, సెల్వ రాజు, స్వతంత్ర బాబు, జగదీష్, వినోద్, నరేష్ రెడ్డి, భాస్కర్, మణి, ఆనందబాబు, రెడ్డప్ప, తదితరు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు పి మంజులమ్మ

మొగిలిశ్వర స్వామి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలంలోని శ్రీ కామాక్షి సమేత మొగిలి శ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని కరణం సంక్షేమ సంఘ సభ్యులు 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను కార్యదర్శి రవీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం మొగలి శివాలయంలో అత్యంత వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షు లు చంద్రశేఖర్ పిలై మాట్లాడుతూ మొగిలి గ్రామంలో వెలసిన కామాక్షి సమేత మొగిలిశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు దేవదేవుడు హంస వాహనంపై విహరిస్తారని ఆ సేవకు మన సంఘం ఎంతో తృప్తితో పూజలు, నైవేద్యాలు సమర్పిస్తున్నారని ఇది గొప్ప విశేషం అన్నారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు షణ్ముఖ పిలై ,దశరథరం పెళ్లి, వెంకటరమణ, సురేష్, రవీంద్ర ప్రసాద్, శంకరన్ ,హరిహర ప్రసాద్ ,రవిచంద్ర పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొగిలీశ్వర స్వామి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కరణం సంక్షేమ సంఘం సభ్యులు

కుప్పంలో షణ్ముగం రెడ్డి పర్యటన

ప్రజాశక్తి-కుప్పం: టిడిపి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడిగా నియమితులైన షణ్ముగం రెడ్డి ఆదివారం కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. పార్లమెంట్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారి కుప్పంలో పర్యటించడంతో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసి వైస్ చైర్మన్ ముని రత్నం ఆయనను ఘనంగా సత్కరించారు. టిడిపి అధినేత సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పార్టీ కోసం సమిష్టిగా పనిచేయాలని ఆయన సూచించారు. తనపై నమ్మకంతో సీఎం చంద్రబాబు చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని, పార్టీ శ్రేణులను కలుపుకుని పార్టీ అభివృద్ధి కోసం ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, ఏపీఈడబ్ల్యూడిసి చైర్మన్ రాజశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మాజీ ఏఎంసి చైర్మన్ సత్యేంద్ర శేఖర్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్ సోమశేఖర్, రెస్కో డైరెక్టర్లు ఆర్ముగం,శివ,మురళి, కార్పొరేషన్ డైరెక్టర్లు మణి, తిరుమగల్, పాల్గొన్నారు. కుప్పం నియోజకవర్గం పర్యటనలో భాగంగా విచ్చేసిన షణ్ముగం రెడ్డికి శాంతిపురం మండలం టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అడుగుపెట్టిన ఆయన మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేసి పార్టీ నాయకులతో మాట్లాడారు. అనంతరం నియోజకవర్గ కేంద్రమైన కుప్పంకు బయలుదేరారు. షణ్ముఖం రెడ్డికి స్వాగతం పలికిన వారిలో మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, శాంతిపురం మండలం టిడిపి అధ్యక్షులు నందిగామ ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మంజునాథ్, యూత్ అధ్యక్షులు బాలాజీ, సర్పంచ్ విజయరామిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



అనాథ మృతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: శక్తి క్షేత్రం బోయకొండకు సమీపంలోని భవాని నగరలో ఓ అనాథ యాచకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చౌడేపల్లి మండలంలో చోటు చేసుకుంది. మృతుడి తల్లి లక్ష్మమ్మ కథనం మేరకు... పెద్దపంజాణి మండలం రాయలపేట గోరీ నగర్‌కు చెందిన లక్ష్మమ్మ గోవిందులు గ్రామం విడిచి పొట్టకూటికోసం పొరుగు ప్రాంతాల్లో 10 సంవత్సరాలుగా తిరుగుతున్నారు. ఈ క్రమంలో బోయకొండకు చేరుకున్నారు . ఆదివారం ఉదయాన్నే తల్లి కొడుకులు రోడ్డు దాటుతుండగా కుమారుడు గోవిందు ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. చుట్టుపక్కల వారు వచ్చి చూసిన సరికి అతను అప్పటికే మృతి చెందాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. 100కు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో పోలీసులు కలుగజేసుకొని మృతుడి తల్లి ద్వారా చిరునామాను సంపాదించి వారికి తెలిపి మృతదేహాన్ని సొంత గ్రామానికి తరలించారు. ఉదయం నుంచి ఎవరు పట్టించుకోక పోవడంతో పోలీసులు మానవత్వాన్ని చూపించి మృతదేహాన్ని వారి సొంతగూటికి చేర్చడంతో స్థానికులు అభినందించారు.

విజయకాంత్‌కు ఘననివాళి

ప్రజాశక్తి -విజయపురం (నగరి): తమిళ సినీనటుడు, డీఎండీకే వ్యవస్థాపకుడు విజయకాంత్ వర్ధంతిని ఆయన అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పరిధి కొత్తపేటలో విజయకాంత్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పుష్పాలతో అలంకరించారు. హారతులు ఇచ్చి నివాళులర్పించారు. ఆయన పేదలకు చేసిన సాయాన్ని ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు, డీఎండీకే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు కార్డులో మార్పులు చేర్పులు.. ఇలా సులభం..

ప్రజాశక్తి-పూతలపట్టు: సాధారణంగా ఓటర్ కార్డు.. ఎన్నికల వేళ ఓటు వేసేందుకు మాత్రమే ఉపయోగపడుతుందని చాలామంది భావిస్తుంటారు. కేవలం ఆ సమయంలో మాత్రమే వీటిని బయటకి తీస్తుంటారు. వాటిలో ఏమైనా మార్పులు చేయాలన్న వాటికోసం పెద్దగా పట్టించుకోరు. అయితే ఇవి గుర్తింపు కార్డులు గాను ఉపయోగపడతాయన్న విషయం మాత్రం కొంతమందికి మాత్రమే తెలుసు. దీని ప్రాధాన్యం తెలిసినవారు ఎప్పటికప్పుడు వీటిని నవీకరించు కుంటూ ఉంటారు. గతంలో వీటిలోనే మార్పులు చేర్పులు చిరునామా వంటి వాటి కోసం ఫారం 8 ద్వారా నిర్ణయిత సమయాలలో మాత్రమే అనుమతి ఉండేది. తాజాగా ఆన్ లైన్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఎప్పుడైనా మార్చుకొని వెసులబాటు కల్పించింది ప్రభుత్వం.

తిరస్కరణకు గురి అయితే

రెండు కార్డుల్లోను పేర్లు ఒకేలా లేకుంటే దరఖాస్తు తిరస్కరణకు గురవుతుంది. ఇలా తిరస్కరణకు గురైన వారు బూత్ లెవెల్ అధికారిని సంప్రదించాలి. అలాగే వారి ప్రాంత సచివాలయాలను సంప్రదించి బిఎల్ఓ ను సంప్రదించి చిరునామా మార్పునకు పేరు మార్పునకు తగిన పత్రాలు ఇచ్చి తప్పులు సరి చేయించుకోవచ్చు. ప్రస్తుతం ఈ ప్రక్రియ జరుగుతుంది. ఆఫ్ లైన్ ద్వారా మార్పులు చేసుకోవాలనుకునే వారు ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే సదరు ఓటరు కార్డులో మార్పులు వెంటనే జరుగుతాయి. కార్డును డౌన్లోడ్ చేసుకొని గుర్తింపు కార్డు గాను ఉపయోగించుకోవచ్చునని అధికారులు అంటున్నారు.

చిన్న తేడా ఉన్నా..

ఆన్లైన్లో ఓటర్ కార్డు చిరునామా మార్చుకునేందుకు ఆధార్ పాస్పోర్టు పాన్ కార్డు తదితర గుర్తింపు కార్డులను అనుమతిస్తారు. వీటి ద్వారా ఆధార్ కార్డులో ఏ విధంగా ఉందో ఓటర్ కార్డులోనూ అదే విధంగా ఉండేటట్లు చూసుకోవాలి. వేరువేరుగా ఉంటే మార్పుల కోసం దరఖాస్తు చేసినప్పటికీ వాటిని రిజెక్ట్ చేస్తారు. ఆన్లైన్లో ఓటరు సర్వీసు పోర్టల్ లోకి వెళ్లి అందులో ఫోరం 8 ఆప్షన్ లోకి వెళ్లి దానిని పూర్తి చేయాలి. ముఖ్యంగా ఆధార్ కార్డులో ఉన్నట్లుగానే పూర్తి చేయాల్సి ఉంటుంది. దానిని పూర్తి చేసిన చివరిలో ఓటిపి వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది. ఆధార్ కార్డులో వివరాలు సరిపోలి ఉంటే దరఖాస్తు ఆమోదిస్తారు. లేదా తిరస్కరించినట్లు చూపిస్తారు. దరఖాస్తు పూరించే ముందే ఆధార్ ఓటర్ కార్డ్ లో పేర్లు ఒకేలా ఉండాలని సూచిస్తుంది. ప్రస్తుతం చిరునామా మార్పునకు మాత్రమే అవకాశం ఉండగా పేరులో ఏవైనా తప్పులు ఉంటే బిఎల్ఓ ను సంప్రదించాలని సైట్ లో చూపిస్తుంది. పేరు సవరించుకున్న తరువాత చిరునామా మార్పు అవుతుంది. ఫోటోలలో మార్పులు చేర్పులు చేసుకోవడానికి సదా అవకాశం.



అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం

- మత్తుపానీయాలు తయారు చేస్తే కఠిన చర్యలు
- పోలీసు కేసులకు దూరంగా ఉండాలి
- సీఐ ఎస్‌హనుమంతప్ప

ప్రజాశక్తి -కార్వేటినగరం: సారా రహిత సమాజ నిర్మాణానికి అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం మోపక తప్పదని కార్వేటినగరం సీఐ ఎస్‌హనుమంతప్ప హెచ్చరించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు నగరి డీఎస్పీ మహ్మద్ అజీజ్ పర్యవేక్షణలో ఆదివారం సీఐ స్పెషల్ పార్టీ సిబ్బందితో మండల పరిధిలోని కొటార్వేడు గ్రామంలో, కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి సుమారు 200 లీటర్ల నాటు సారా బెల్లం ఊటను ధ్వంసం చేశారు. రికార్డులు సక్రమంగా లేని 15 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సారా అమ్మకాలు, తయారీలు వంటి అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పచ్చని పల్లెల్లో, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల నుండి రక్షించుకుని కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. వాహన చోదకులు వాహనాలకు సంబంధించిన రికార్డులతో పాటు లైసెన్సు కలిగి ఉండాలని ఆదేశించారు. బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సాహించడం నేరం అన్నారు. అలాంటి వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజశేఖర్, యువరాజ్, రాజ, సెప్షల్ ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్ర నాయుడుకి పలువురు అభినందనలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: చిత్తూరు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులుగా రామచంద్ర నాయుడును నియమించడం శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా బైరెడ్డిపల్లి మండలంలోని గడ్డూరు గ్రామానికి చెందిన బెంగళూరు అన్నపూర్ణ ట్రస్ట్ అధినేత, నేషనల్ హ్యూమన్ రైట్స్ ఉపాధ్యాయురాలు ఎం. విజయ ఆదివారం రామచంద్ర నాయుడు స్వగ్రామమైన వీకోటకు చేరుకున్నారు. ఆయన సతీమణి ఇందిరాలకు కండువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎం విజయ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తమ అన్న యంజి రామచంద్ర నాయుడుని చిత్తూరు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులుగా ఎంపిక చేయడం చాలా ఆనందకరం వుందన్నారు. పెద్దలు ఇచ్చిన ఈ గౌరవాన్ని ఆయన పొందడం తమకు ఎంతో శుభదాయకం అన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న తమ అన్న రామచంద్ర నాయుడు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరోసారి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. రామచంద్ర నాయుడు స్పందిస్తూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన ఎం విజయకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం స్థానిక నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. రామచంద్ర నాయుడు నియామకం చిత్తూరు జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామంగా మారనుందని రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.



రామచంద్రనాయుడు దంపతులను సన్మానిస్తున్న ఎం విజయ